**అప్పుడెప్పుడో ఒక పాత సినిమాలో అల్లసాని పెద్దన పాత్ర ద్వారా చక్కదనాల యువతి ఒకామెను వర్ణించడానికి ఒక పద్యం పెట్టేరు:**

# కాగితం పువ్వులు

**-భరాగో**

"మలయాశాగత మారుతోల్లలిత పంపా వీచికా డోలికా
చల ఉత్ఫుల్లజ తేజమాలికయో, చంచచ్చంచలా తన్వియో!"-అని ఉన్న ఆ వర్ణనలో, మాటలు రూపాలు పోసుకొని నడిచివచ్చి అక్కడ కూర్చున్నాయా-అనిపించేటట్టుగా ఉన్నారు, ఆ ఇద్దరు అమ్మాయిలూ.

ఆ విశాలమైన సోఫాలో నా కుడి వైపు మా బావమరిది అమరయ్య, ఎడమ వైపు నా భార్య ఉన్నారు. ఆ పిల్లలు అక్కడ కూర్చుని మంచి ఆత్మవిశ్వాసం నిండిన చూపులతో కళ్ల లోపలి నవ్వులను పెదవుల మధ్యకి తెచ్చుకొని ప్రసన్నంగా ఉన్నారు.

నా భార్యకు, మా బావమరిదికి: ఒకేసారి నాతో వాళ్ల ఆమోదాన్ని నా శరీరాన్ని రెండు వైపుల నుంచి రెండు విధాలుగా స్పృశించారు. స్పర్శ ఒక భాష. తల మీద, వీపు మీద, జబ్బ మీద, బొజ్జ మీద, బుగ్గ మీద, అరచేతి మీద చేసే స్పర్శలు ఎన్నెన్ని సందేశాలు చెప్పగలవో చెప్పడానికి చాలామందికి తెలీదు. ఒక కేరళ స్వామి ఒకానొక సందర్భంలో నేర్పిన శాస్త్రసూక్ష్మాలు ఆ క్షణంలో నా మీద పని చేసినా, లౌక్యం అవసరమైన స్థలం కనుక ఆ ఆమోదాలకి నేనేమీ ప్రతిస్పందించలేదు.

సుమారు పదిహేను రోజుల కిందట, ఈ పిల్లల తాతగారు మా ఇంటికి చాలా కష్టాలు పడి, ఇబ్బందులు పడి, వచ్చారు. "బాబూ, నా కంటే చిన్నవారు. మీకు ఆశీర్వచనాలే తప్ప నమస్కారం చెప్పలేను. మీ జ్ఞానాన్నీ, ప్రయోజకత్వాన్నీ ఆమోదించగలనే తప్ప స్తుతించలేను" అని ఈ పిల్లల పెళ్లి సంగతి నా దగ్గర ప్రస్తావనకు తెచ్చాడు. తన పేరు హరిహరయ్య అని హైదరాబాదులో ఒకానొక ఆరోగ్యకరమైన పేటలో గొప్పది కాకపోయినా, చెప్పుకోతగ్గది అనిపించుకొనే ఆరుగదుల ఇల్లు ఉందని చెప్పేడు. ఈ పిల్లలిద్దరూ ఆయన మనవరాళ్లు. ఒకతె పౌత్రి, ఇంకొకతె దౌహిత్రి. ఈ పిల్లల తండ్రులు పదేళ్లనాడు అమెరికా వెళ్లిపోయారు. అక్కడికి వెళ్లాక ఈయన కోడలు చనిపోయింది. కొడుకు ఆ దేశపు వనిత నొకామెను ద్వితీయం చేసుకున్నాడు. ఆమెకు అంతకు ముందు ఒకడు, ఆ తర్వాత ఒకడు-మగపిల్లలు.

ఇక అల్లుడి సంసారంలో కూడా మనకి చిన్నవే అనిపించే కొన్ని పొరపొచ్చాలు వచ్చాయి. ఈ కుటుంబంలోంచి వెళ్లిన నలుగురికీ అమెరికాలో దూరదూరాల స్థలాల్లో ఎక్కువెక్కువ పని భారాల ఉద్యోగాలు. ఆ పని భారాల ఒత్తిడి ఎంత అంటే, ఇక్కడ హరిహరయ్యగారి ఇల్లాలు అయిదేళ్ల క్రితం కాలం చేసినప్పుడు గాని, ఈ పిల్లలు తొమ్మిదేళ్ల నాడు వ్యక్తురాళ్లయినప్పుడు గాని, వారిలో ఏ ఒక్కరూ రాలేకనేపోవడం ఒకటైతే, అక్కడ కూడా ఏడాదికొకసారి మొహాలు చూసుకోగలిగితే అదే గొప్పగా గడుపుతున్నారు. ఇక్కడ శుభం, శౌచం-ఏది తటస్థపడినా గుంటూరులో ఉన్న రెండో కొడుకు, వరంగల్‌లో ఉన్న పెద్ద కూతురు-నడుములు బిగించి పనులు జరిపించి, హరిహరయ్యగారికి అండగా నిలబడి ఉన్నారు.

డబ్బుకి ఏమీ లోటు లేదు. ఇన్నేళ్ల ఎడబాటులో ఈ పిల్లల ఆలన -పాలన, పెంపకాల్లో తగులుతూ ఉండిన ఖర్చులలో దేనికీ, హరిహరయ్యగారి పెన్షను ఏ నెలలో కూడా సగం కంటే మించి ఖర్చవలేదు. డాలర్లే డాలర్లు! పిల్లల పేరన ఎలా లేదన్నా మూడేసి లక్షల రూపాయల చొప్పున నిలవలు ఉన్నాయి.

"మీరిప్పుడు ఇక్కడికి తీసుకురాలేదు గాని, నేను క్రిందటి సారి విశాఖపట్నం వచ్చినప్పుడు అక్కడ మీ తమ్ముడు గారబ్బాయినీ, తిరిగి హైదరాబాద్ వస్తూ ఏలూరులో ఆగి మీ అబ్బాయినీ చూశాను. వాళ్ల చదువులూ, స్వరూపాలు, జీవనమార్గాలూ నాకు సమ్మతంగా ఉన్నాయి. మా పిల్లల కంటే అన్నిటా ఎక్కువైన వాళ్లే. ఒక వేళ ఎక్కువ కాకపోతే సమఉజ్జీలు. అందుచేత మిమ్మల్ని ఇంత దూరం రప్పించి ఇబ్బంది పెట్టేను. మీ దంపతులిద్దరే వచ్చి చూస్తారని అనుకున్నాను. కాని మీరు మా మీద అపేక్ష చేత మీ బావమరిది గారినీ, మీ హితైషి ఒకరినీ కూడా తీసుకొచ్చి మా గృహం పావనం చేశారు. ఇక మీరు సపాత్ర ప్రాయంగా ఆమోదిస్తే, పిల్లలు, వాళ్లూ వాళ్లూ వెసులుబాట్లను బట్టి ఒకరూ ఒకరూ చూసుకుంటారు."

"వాళ్లని కూడా ప్రయాణానికి ఒప్పించాను. కాని, ఇద్దరూ మనకర్థం కాని విలువలకి చెందిన బాధ్యతలలో ఉన్నారు. రాలేకపోయారు" అన్నాను నేను.



వంటావిడకీ, అపేక్షాపరురాలైన పెద్ద దిక్కుకీ మధ్యరకంగా ఉన్న ఒకావిడ, ఒక పెద్ద ట్రేలో మంచి ప్లేట్లలో పేర్చిన తినుబండారాలతో వచ్చి, ఆ ట్రేని సభామధ్యంగా ఉన్న మేజా మీద ఉంచింది. వెంటనే లోపలికి వెళ్లి అంత కంటే కొంచెం చిన్న ట్రేలో మంచినీళ్ల గ్లాసులు తెచ్చి ఆ పక్కన పెట్టింది. కొంచెం వెనక్కి తప్పుకొని "శీలా, భద్రా! మీ చేతులతో వాళ్లకి అందించండమ్మా!" అని మరి కొంచెం వెనక్కి తప్పుకొని చేతులు కట్టుకొని నుంచుంది.

పిల్లలిద్దరూ లేచి చిరునవ్వులు చిందిస్తూ మేజా చేరారు.

హరిహరయ్యగారు వేలితో వారిద్దరినీ చూపిస్తూ "ఇది శీల, నా పౌత్రి. అది భద్ర, దౌహిత్రి. వీళ్లిద్దరికీ వయస్సు తేడా నలభై రోజులు. అసలు పేర్లు సుశీల, సుభద్ర. కొత్తరకం చదువులు పేర్లని క్లుప్తం చేసు కోమన్నాయి. అందువల్ల శీలా, భద్రా అయ్యారు."



మాతో వచ్చిన హితైషి అంబరీషుడు గారు. 70 ఏళ్లు. నా కంటే పదమూడేళ్లు పెద్ద. నన్నూ నా భార్యనీ, మా ఇరువైపుల కుటుంబాలనీ కూలంకషంగా ఎరిగి, మంచికీ, చెడ్డకీ మాకు తండ్రి తరువాత తండ్రంత వారుగా ఉంటున్నారు. సరసుడూ, సహృదయుడూ, సంపన్నుడూ. పిల్లలు చిరునవ్వుతో మేజా మీది ప్లేట్లను వాా చేతులతో పెడుతూ ఉండగా, పెద్దాయనతో ఒకరితోనే మాట్లాడినట్టు అన్నాడు-"కొత్తరకం చదువుల వాళ్లకు సుశీల, సుభద్ర అనే పేర్లలో ఉన్న ఆత్మీయత తెలియక ఇద్దరికీ 'సు' అనే (మంచి) అక్షరాన్ని తీసేయవలసి వచ్చినా, శీల అనీ, భద్రత అనీ అంటూ ఆ శబ్దాలలోని మౌలికవిలువలు మాత్రం ఉంచారు. ఇది కాకతాళీయమే అయినా, దీని వల్ల మేలే జరిగింది. ఏమంటారు?"

హరిహరయ్యగారు తత్త్వవేత్తలాగా నవ్వాడు. ఒక నమస్కారం చేసి, "తమ వంటి పెద్దల దయ!" అన్నాడు.

***

వేం అందరం విశాఖపట్నంలో బయలుదేరినప్పుడు ఈ తతంగానికి రూపరేఖలు ఇవి-అని ఒక భావం ఏర్పరుచుకున్నాము.

అబ్బాయిలిద్దరూ రావడం లేదు. కనుక, అమ్మాయిలను ఉద్దేశించి వచ్చే ప్రశ్నలు, అభిరుచీ, వివరణలు ఇలాంటి వాటి జోలికి మేము పోకూడదని, చూపులంటే చూపులే అని. కాని అంబరీషుడు గారు, ఆ పిల్లల పేర్లను గురించి రేగిన విచికిత్సతో ముగ్గులోకి దిగినట్టు ప్రస్ఫుటం అయి పోయింది. ఆయన ఆ పిల్లల ఇద్దరి మధ్యకి చేరి ఆ సోఫా మీద సుఖంగా కూర్చున్నాడు. ఇద్దరి తలల మీదా రెండు చేతులూ వేసి "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు!" అని దీవించాడు.

"ఏదీ, మరోసారి చెప్పమ్మా, నీ పేరు నీ నోటితో" అని కుడి వైపున్న అమ్మాయిని అడిగాడు.

"వై నాట్? ఐ టెల్ యు మోర్ టూ. నా పేరు 'శీల'. ఇదే, సుశీల. శీల అని షార్ట్ నేమ్."

ఎడమ వైపున్న అమ్మాయి వెంటనే, "సేమ్ విత్ మి. నా పేరు సుభద్ర. భద్ర ఈజ్ ఆఫ్‌కోర్స్ ది షార్ట్ నేమ్. షార్ట్ నేమ్స్ ఎట్రాక్టివ్‌గా కన్వీనియెంట్‌గా ఉంటాయి. మా ఫ్రెండ్స్ మేల్ అండ్ ఫిమేల్-సుష్మ, రేష్మి, లయ, నవ్య, భవ్య, దివ్య, కావ్య, శ్రేయ, నేహ, మీన, రవి, శివ, రాజు, వెంకు, బాలు, నాగ్, శ్రీను...."

"ఏం చదువుకున్నారో?"

"మేం ఇద్దరం క్లాస్‌మేట్స్ గానీ, సబ్జక్ట్ మేట్స్ కాదు. భద్ర వాంటెడ్ టు బికమ్ ఎ డాక్టర్. మై సెల్ఫ్ ఎ కంప్యూటర్ ఇంజనీర్."

"కాని ఇద్దరం అనుకున్నదేదీ అవలేక పోయాం."

"బట్ వుయార్ ది సేమ్ ఇన్ ద మీడియా."

"పాటా, అదీ నేర్చుకున్నారా?"

"టు హెల్ విత్ సాంగ్! అయితే వుయ్ లెరన్డ్ హౌ టు డాన్స్. ఆఫ్‌కోర్స్, నాట్ ద క్లాసికల్ స్టఫ్!"

"ఇవాళ రేపు టీవీ యాంకరింగ్, మూవీ యాక్టింగ్ దే ఆర్ ది ఓన్లీ ఐడియల్స్ ఫర్ గ్రోయింగ్ అప్స్."

"బోహీమియన్ టాలెంట్స్‌ని అండర్‌స్టాండ్ చేసుకోవాలన్నా, ఎడాప్ట్ చేసుకోవాలన్నా టీవీ ఎండ్ బిగ్ స్క్రీన్ హిట్ ద పాట్."

"నో డౌట్."

"అంటే మీరు సినిమాల్లో కూడా నటించారా?"

"నో. భద్రా డిడ్ ఇట్. నేను టీవీ యాంకరింగ్ తోటే శాటిస్ఫై అయిపోయాను."

"ఎన్ని సినిమాల్లో వేశావమ్మా? పేర్లు చెబితే గుర్తు తెచ్చుకుంటాం."

"నో! నేను చేసిన మూడు పిక్చర్లూ గుజరాతీవే. షూటింగ్ ముంబయిలో, రాజస్థానీ లో పేలెసెస్‌లో, హిమాలయాస్‌లో, చేశారు. ఆ మూవీస్ మనకిక్కడ రావు. ఏదైనా గుజ్‌రాతీ టీవీ ఛానెల్ ఉంటే అకేషనల్‌గా చూడగలమేమో. ఛాన్సెస్ విల్ బి రేర్."

"నీ సంగతేమిటమ్మా, సుశీలా?"

"లెట్ మి టెల్యూ! భద్ర పేరుకు మాత్రం సేఫ్. కాని నన్ను మాత్రం మా కలీగ్స్ 'ఐరన్ సేఫ్' అంటారు. తెలుగులో ఉన్న టీవీ ఛానెల్స్‌లో మూడింట్లో సూపర్ బంపర్ పాపులర్ యాంకర్ నేనే!"

"అలాగా? మేం ఎప్పుడో గానీ టీవీ చూడం. ఆ ప్రోగ్రాముల టైటిల్స్ ఏమిటి?"

"ఓ.... దేరార్ సో మెనీ! 'ఓల్డ్ ఈజ్ గోల్డ్ హాస్యపటం లంపటం, కాఫీ హోటల్ లాఫింగ్ హోస్టల్, మా సెన్సు సినిమా సెన్సు', ఇంకా.."

"ఔనౌను! ఈ మధ్య ఒకటి నాకూ తగిలింది. అదేదో సరిగా గుర్తు రావడం లేదు కాని జాకెట్ కావాలా, లంగా కావాలా అని అలా వస్తుంది, దాని టైటిలు."

"వండర్‌ఫుల్! మీలాంటి ఓల్డ్ మెన్ ఎంకరేజ్‌మెంట్ ఉంటే అదే మాకు గ్రేట్. థాంక్సెలాట్. తాతయ్యగారూ! కుడోస్ భద్రా!" అని శీల లేచి, తన రెండు అరచేతులనీ పైకెత్తి, భద్ర అరచేతులకు తాకించి, యథోచితమైన శబ్దాన్ని సృజించింది.

***

మమ్మల్ని గెస్ట్ హౌస్‌లో చేర్చడానికి హరిహరయ్యగారు కూడా వారి విశాలమైన కారులో డ్రైవరుతో పాటు వచ్చారు. వాళ్ల ఇల్లు మంచి 'హార్ట్ ఆఫ్ ది సిటీ' లోనే ఉంది గాని మా గెస్ట్ హౌస్ చాలా దూరంలో ఉంది.

అంబరీషుడుగారు కారులో నాకూ, హరిహరయ్య గారికీ మధ్యన కూర్చున్నారు. "మీకు ఆశాభంగం కలిగిస్తున్నామని నొచ్చుకోకండి. మీ పిల్లలు అందచందాలతో, తెలివితేటలతో, అధునాతనమైన ప్రపంచానికి అనుగుణమైన ప్రవర్తనాబలంతో ధగధగ లాడుతున్నారు. దాంట్లో ఏమీ సందేహం లేదు. మా పిల్లలతో పోలిస్తే వాళ్లు ఆకాశపు తారలు. మళ్లీ మా అబ్బాయిలు రావడం, మీ పిల్లలని ఏవో తెలివితక్కువ ప్రశ్నలు అడగడం, అయ్యో! మనం ఇంకా ఎదగలేదే-అని చిన్నబుచ్చు కోవడం, ఇవన్నీ ఎందుకు? ఈ వ్యవహారం ఇక్కడితో చాలించుకుందాం.

"మీ పిల్లలు మీకు అలవి గానంతగా ఎదిగారు. టీవీ ఏంకర్స్‌గా ఉంటున్న పిల్లల హావభావాలూ, భాషా, ఉచ్చారణలూ ఈ నేలని విడిచి చేస్తున్న సాములని, మాకు అనిపిస్తుంది. రెండో, మూడో తెలుగు సినిమాల్లో వేషాలు వేసేసి ఆ సంపాదనతోనూ, అనుభవాలతోనూ తృప్తిపడి, కొత్త జీవితాల కోసం తిరిగి ఇళ్లకి చేరుకుంటున్న ఉత్తరాది అమ్మాయిల్ని చూస్తున్నాం కదా! ఆ రాష్ట్రాల ఆడపిల్లలు ఇక్కడ చేస్తున్న వేషధారణలు, వాళ్లని చూసి విలువలూ, వలువలూ దిగజార్చుకుంటున్న మొగపిల్లలూ కొల్లలు పెళ్లలుగానే ఉన్నారు. మన ఆడపిల్లలు అక్కడి సినిమాల్లోనూ అలాంటి పాత్రధారణా, వస్త్రధారణా, సంపాదనా చేస్తున్నారేమో? ఏమైనా సరే, మా అబ్బాయిల్ని ఈ సంస్కృతికి బలి చెయ్యాలంటే మనసులు రావడం లేదు, క్షమించండి."

***

ఈ అంబరీషుడు గార్లాంటి వాళ్లింతే. వాళ్ల ప్రపంచమే రైటనుకుంటారు. కొత్త రకం ఆడపిల్లలకి పెళ్లిళ్లే అవ్వనుకుంటారు. వీళ్లకి వంటలు రావనీ, పెద్దవాళ్లని ప్రేమగా, గౌరవంగా చూడ్డం రాదనీ, ఈ మెరుపు బొమ్మలకి సంపాదనలే గాని, సద్భావాలు లేవంటారు. మారుతున్న ప్రపంచంలో మనుషుల తత్వాలూ, జీవనవిధానాలూ, చర్యలూ కూడా మారుతాయనీ గ్రహించరు. వెకిలి వేషాలతో అర్థం లేని కబుర్లతో ప్లాస్టిక్ పువ్వుల్లా మెరిసే ఈ పిల్లలకి పెళ్లిళ్ళవుతాయా -అని ఆయన బెంగపెట్టేసుకుంటారు.

అవుతాయి, ఎందుకవ్వవు?

వళ్లు తోముకొనే వుల్ల నుంచీ పెళ్లి కావలసిన పిల్ల వరకూ ఏదీ మిగిలిపోదు. అన్ని పదార్థాలకి లాగానే పెళ్లి పదార్థానికి కూడా వెల లుంటాయి. వాటికి అనుగుణమైన సర్దుబాట్లూ తటస్థపడతాయి. ■

## పారితోషికం ఎక్కువడిగే నటి

ఎవరంటే కరీనాకపూర్. దాన్ని గురించి చెబుతూ, "చిత్రం బడ్జెట్ ఏమిటో తెలుసుకుని దాన్ని బట్టి పారితోషికం అడుగుతాను. 'చమేలీ' బడ్జెట్ కోటి రూపాయలని తెలిసి పారితోషికమూ అంతే అడిగాను. జె.పి. దత్తా గారి చిత్రాన్ని ఒక్క పైసా కూడా తీసుకోకుండానే చేస్తున్నాను. మణిరత్నం చిత్రం కూడా చాలా తక్కువ డబ్బుకే చేస్తున్నాను. దీవ, ఋతుల చిత్రాలు కూడా తక్కువ పారితోషికానికే అంగీకరించాను. పెద్ద బడ్జెట్ చిత్రాలైన 'బేవఫా' వంటి వాటికే ఎక్కువ పారితోషికం అడుగుతాను" అంటున్నది కరీన. బాగానే వుంది!

